రక్తదాతల సమూహ సేవలు దేశానికే ఆదర్శం

సన్మానం పొందిన రక్తదాతలు

కామారెడ్డి, జనవరి 12 : కామారెడ్డిలోని కళా భారతి ఆడిటోరియంలో కామారెడ్డి రక్తదాతల సమూహ 18వ వార్షికోత్సవాన్ని ఆదివారం నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మున్సిపల్ చైర్‌పర్సన్ ఇందు ప్రియ హాజరై రక్తదాతలకు శాలువా కప్పి, జ్ఞాపికలను అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. కామారెడ్డి రక్తదాతల సమూహం సేవలను దేశానికే ఆదర్శంగా నిలుస్తున్నాయని అన్నారు. రక్తదాతల సమూహం ఫౌండర్ బాలు మాట్లాడుతూ.. 2007 లో రక్తదాతల సమూహాన్ని నెలకొల్పామని చెప్పారు. తలసేమియా చిన్నారుల కోసం 4,500యూనిట్లు, కరోనా సమయంలో వంద యూనిట్ల ప్లాస్మాను సమకూర్చినట్లు చెప్పారు. ఇప్పటివరకు 250కి పైగా రక్తదాన శిబిరాలను ఏర్పాటు చేసి, రక్తాన్ని సేకరించామని తెలిపారు. కార్యక్రమంలో లయన్స్ క్లబ్ వివేకానంద అధ్యక్షుడు మారుతి, ఆర్కే విద్యా సంస్థల చైర్మన్ జైపాల్ రెడ్డి, రక్తదాతల సమూహ సభ్యులు వేదప్రకాశ్, గంప ప్రసాద్, జమీల్ హైమద్, చంద్రశేఖర్, వెంకటరమణ, సాయి, అంజల్ రెడ్డి, సుధాకర్, నరేందర్ గౌడ్, రోశయ్య తదితరులు పాల్గొన్నారు.

దివ్యాంగులకు ఇచ్చిన హామీలను అమలు చేయాలి

మాజీ మంత్రి నిరంజన్‌రెడ్డికి వినతిపత్రం అందజేస్తున్న వికలాంగుల సేవా సమితి బాధ్యులు

కామారెడ్డి, జనవరి 12: కాంగ్రెస్ పార్టీ ఎన్నికలకు ముందు దివ్యాంగులకు ఇచ్చిన హామీలను అమలు చేసేలా ప్రభుత్వంపై ఒత్తిడి తేవాలని కోరుతూ బీఆర్ఎస్ సీనియర్ నేత, మాజీ మంత్రి నిరంజన్‌రెడ్డిని విజ్ఞాన్ వికలాంగుల సేవా సమితి బాధ్యులు కోరారు. ఈ మేరకు ఆయనను హైదరాబాద్‌లో ఆదివారం కలిసి వినతిపత్రాన్ని అందజేశారు. ఎన్నికల సమయంలో దివ్యాంగులకు రూ.ఆరు వేల పింఛన్ ఇస్తామని, ఉచిత రవాణా సౌకర్యం కల్పిస్తామని, బ్యాక్ లాగ్ పోస్టులు భర్తీ చేస్తామని, ఉన్నత విద్యా, ఉద్యోగాల్లో రిజర్వేషన్లు కల్పించడంతోపాటు 2016 దివ్యాంగుల చట్టం పూర్తి స్థాయిలో అమలు చేస్తామని ఇచ్చిన హామీలను నెరవేర్చాలని కోరారు. విజ్ఞాన్ వికలాంగుల సేవా సమితి వ్యవస్థాపకుడు చిప్ప దుర్గాప్రసాద్, సభ్యుడు బాల్‌రెడ్డి, సబ్ కమిటీ చైర్మన్ ఈశ్వర్, వైస్ చైర్మన్ నితీశ్‌రెడ్డి పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ ఫొటోలు తీసుకుంటున్న కార్యకర్తలు

అభివాదం చేస్తున్న ఎమ్మెల్సీ

అంబేద్కర్ విగ్రహం వద్ద నినాదాలు చేస్తున్న ఎమెల్సీ కవిత, మాజీ ఎమ్మెల్యే సురేందర్ తదితరులు

ఎమ్మెల్సీ కవితకు ఘన స్వాగతం

- గజమాలతో సత్కరించిన బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు
- బాన్సువాడలో గులాబీ పూలవర్షం
- కార్యకర్తల్లో ఉత్సాహాన్ని నింపిన ఎమ్మెల్సీ

బాన్సువాడ/ బాన్సువాడ టౌన్/ బాన్సువాడ రూరల్ 12: ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత ఆదివారం బాన్సువాడ నియోజకవర్గంలో పర్యటించారు. వర్ని మండలంలోని బడాపహాడ్‌ను సాయంత్రం దర్శించుకున్న అనంతరం బాన్సువాడ మండలంలో పర్యటించారు. హన్మాజీపేట్ గ్రామంలో కార్యకర్తలతో కొద్దిసేపు మాట్లాడారు. అనంతరం బాన్సువాడ కొయ్యగుట్ట వద్ద అమరవీరుల స్తూపం వద్ద బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలతో కలిసి నివాళులర్పించారు. అనంతరం ఆటోలు, బతుకమ్మలు, బోనాలతో బ్యాండ్ మేళాలు, డీజే చప్పుళ్లతో గులాబీ శ్రేణులు బాన్సువాడ పట్టణంలోకి ద్విచక్ర వాహన ర్యాలీతో ప్రవేశించారు. ఇందిరాగాంధీ చౌరస్తా, రాజీవ్ చౌక్ మీదుగా అంబేద్కర్ చౌరస్తా వరకు పటాకులు కాలుస్తూ ఘన స్వాగతం పలికారు. అంబేద్కర్ చౌరస్తాలో ఎమ్మెల్సీని గజమాలతో సత్కరించారు. అక్కడ అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ర్యాలీగా బీఆర్ఎస్ పార్టీ కార్యాలయానికి చేరుకున్నారు. దారి పొడువునా యువకుల కేరింతలు, జై తెలంగాణ నినాదాలు, జై కవితక్క, జై రామన్న అనే నినాదాలు మిన్నంటాయి. యువకులు, మహిళలు ఉత్సాహంగా డ్యాన్స్ చేశారు. డీజే చప్పుళ్ల ద్వారా వదిలిన గులాబీ పేపర్లు పార్టీ శ్రేణుల్లో కొత్త ఉత్సాహాన్ని నింపాయి. ఎమ్మెల్సీ కవితను మున్సిపల్ వైస్ చైర్మన్ షేక్ జుబేర్ నివాసంలో ఆయన కుటుంబ సభ్యులు ఘనంగా సత్కరించారు.

దారిపొడువునా సెల్ఫీలు..

ఎమ్మెల్సీ కవిత పర్యటన బాన్సువాడ మండలంలో జోరుగా సాగింది. పట్టణంలో ఆమె కారు పైకి ఎక్కి కార్యకర్తలకు అభివాదం చేశారు. జై కేసీఆర్, జై బీఆర్ఎస్, జై తెలంగాణ అంటూ నినాదాలు చేశారు. కాంగ్రెస్ పార్టీ ఎన్నికల్లో ఇచ్చిన హామీలపై ఆ పార్టీ నాయకులను నిలదీయాలని దారిపొడువునా ప్రజలకు సూచించారు. ర్యాలీలో ఆమె కారు వద్దకు వచ్చిన పలువురు ఆమెతో సెల్ఫీలు దిగారు.

ఊరూరా వివేకానందుడి జయంతి

- చిత్ర పటాలు, విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళి
- ఆయన సేవలను స్మరించుకున్న జిల్లావాసులు

నమస్తే తెలంగాణ యంత్రాంగం, జనవరి 12: స్వామి వివేకానంద జయంతిని జిల్లావాసులు ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్ర పటాలు, విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. దేశ సంప్రదాయం, ఔన్నత్యాన్ని ప్రపంచానికి చాటిన గొప్ప వ్యక్తి అని గుర్తు చేసుకున్నారు. యువత వివేకానందుడు చూపిన బాటలో నడవాలని వక్తలు సూచించారు. బాన్సువాడలో తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం, బీజేపీ, బాన్సువాడ మండలం బోర్లం క్యాంప్‌లో ఆదర్శ యువజన సంఘం, బీబీపేట్ మండల కేంద్రంతోపాటు జనగామ, మాందాపూర్, యాడారం, తుజాల్‌పూర్, ఇస్సానగర్ తదితర గ్రామాల్లో, మాచారెడ్డి మండలంలోని పాల్వంచ, లచ్చాపేట, మాచారెడ్డి గ్రామాల్లో వివేకానంద జయంతిని నిర్వహించారు. కామారెడ్డిలోని మున్సిపల్ కార్యాలయం ఎదుట స్వామి వివేకానందుడి విగ్రహానికి ఎమ్మెల్యే కాటిపల్లి వెంకటరమణారెడ్డి పూలమాల వేసి నివాళులర్పించారు. భిక్కనూరు మండల కేంద్రంతోపాటు జంగంపల్లి గ్రామంలో ఏబీవీపీ నాయకులు వివేకానంద విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. తాడ్వాయి మండలంలోని కృష్ణాజివాడి గ్రామంలో నిర్వహించిన జయంతి ఉత్సవాల్లో శాస్త్రవేత్త పైడి ఎల్లారెడ్డి పాల్గొన్నారు. ఎల్లారెడ్డి మండలంలోని భిక్నూర్ గ్రామంలో డీఎస్పీ శ్రీనివాసులు ఉత్సవాల్లో పాల్గొన్నారు. తాడ్వాయి మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో యువ ఫౌండేషన్ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం ఏర్పాటుచేశారు. పెద్దకొడప్‌గల్ మండల కేంద్రం, బిచ్కుంద మండల కేంద్రంలో హిందూ వాహిని, యువజన సంఘాల ఆధ్వర్యంలో వివేకానంద జయంతిని నిర్వహించారు.

కామారెడ్డిలో నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే కాటిపల్లి వెంకటరమణారెడ్డి

ఎల్లారెడ్డి డీఎస్పీ శ్రీనివాసులును సన్మానిస్తున్న భిక్నూర్ గ్రామస్తులు

తిప్పారం తండాలో ..

జంగంపల్లిలో..

కృష్ణాజివాడిలో..

పోటీలను ప్రారంభిస్తున్న పీడీ మధుసూదన్‌రెడ్డి

క్రికెట్ పోటీలు ప్రారంభం

కామారెడ్డి రూరల్, జనవరి 12: మండలంలోని గర్గుల్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గర్గుల్ ప్రీమియర్ లీగ్‌ను ఫిజికల్ డైరెక్టర్ నోముల మధుసూదన్‌రెడ్డి ఆదివారం ప్రారంభించారు. పోటీలు మూడు రోజులపాటు నిర్వహించనున్నట్లు తెలిపారు. టోర్నీలో ఆరు జట్లు లీగ్ కం నాకౌట్ పద్ధతిలో ఉంటాయని పేర్కొన్నారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ రవితేజాగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

ఆన్‌లైన్ మోసాలపై అప్రమత్తంగా ఉండాలి

బీబీపేట్, జనవరి 12: ఆన్‌లైన్ మోసాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఎస్సై ప్రభాకర్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇటీవల కాలంలో సైబర్ నేరాల సంఖ్య పెరిగిపోతున్నదని, గుర్తుతెలియని వ్యక్తులు ఫోన్ చేసిన డెబిట్, క్రెడిట్ కార్డులను అప్‌డేట్ చేయాలని, బహుమతి వచ్చిందని ప్రాసెసింగ్ ఫీజు కోసం కొన్ని డబ్బులు పంపాలని అడుగుతున్నారని పేర్కొన్నారు. వారి మాటలు నమ్మవద్దని పేర్కొన్నారు. ప్రభుత్వ పథకాలకు సంబంధించి లోన్లు మంజూరయ్యాయని, వివిధ రకాల యాప్‌లు డౌన్‌లోడ్ చేసుకోవాలని చెబుతారని, వాటిని ఇన్‌స్టాల్ చేసి వివరాలను నమోదు చేస్తే మీ బ్యాంకు ఖాతాలోని డబ్బులు సైబర్ నేరాగాళ్ల బ్యాంకు ఖాతాలోకి వెళ్తాయని తెలిపారు. అపరిచిత వ్యక్తుల ఫోన్ కాల్స్‌తో అప్రమత్తంగా ఉండాలని ఎస్సై సూచించారు.

బోరు డ్రిల్లింగ్ పనుల ప్రారంభం

లింగంపేట(ఎల్లారెడ్డి రూరల్), జనవరి12: ఎల్లారెడ్డి మండలంలోని మీసన్‌పల్లి గ్రామంలో ఆదివారం బోరు డ్రిల్లింగ్ పనులను కాంగ్రెస్ పార్టీ నాయకులు ప్రారంభించారు. గ్రామంలో నెలకొన్న తాగునీటి సమస్య పరిష్కారం కోసం బోరు వేయించాలని ఎమ్మెల్యే మదన్‌మోహన్ దృష్టికి తీసుకువెళ్లగా వెంటనే స్పందించి బోరుడ్రిల్లింగ్‌కు నిధులు మంజూరు చేసినట్లు వారు తెలిపారు. కార్యక్రమంలో ఎల్లారెడ్డి వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ వెంకట్రాం రెడ్డి, ఎల్లారెడ్డి మున్సిపల్ మాజీ చైర్మన్ కుడుముల సత్యనారాయణ, నాయకులు బోండ్ల సాయిలు, శాముల్, సుఖేందర్‌రెడ్డి, సంజీవరెడ్డి, నాగయ్య తదితరులు పాల్గొన్నారు.

మీసన్‌పల్లి గ్రామంలో బోరు డ్రిల్లింగ్ పనులు ప్రారంభిస్తున్న నాయకులు

సీసీ రోడ్డు పనుల ప్రారంభం

లింగంపేట మండల కేంద్రంలోని మత్తడికింది పల్లిలో సీసీ రోడ్డు పనులు ప్రారంభిస్తున్న నాయకులు

లింగంపేట, జనవరి 12: మండలంలోని కోర్పోల్ గ్రామంలో ఐదులక్షల రూపాయలతో సీసీ రోడ్డు పనులను కాంగ్రెస్ పార్టీ నాయకులు ఆదివారం ప్రారంభించారు. జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం ద్వారా మంజూరైన నిధులతో సీసీ రోడ్డు నిర్మాణం చేపడుతున్నట్లు నాయకులు తెలిపారు. లింగంపేట మండల కేంద్రంలోని మత్తడికింది పల్లిలో ఐదు లక్షల రూపాయలతో సీసీ రోడ్డు పనులు ప్రారంభించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు బుర్ర నారాగౌడ్, ఏఎంసీ వైస్ చైర్మన్ రాజు, లింగంపేట గ్రామ కమిటీ అధ్యక్షుడు ప్రసాద్‌గౌడ్, మండల యూత్ అధ్యక్షుడు రాజు, సోషల్ మీడియా కో-ఆర్డినేటర్ నగేశ్ నాయకులు పాల్గొన్నారు.

తహసీల్ కార్యాలయం ఎదుట మూసుకుపోయిన దారి

మండల పరిషత్ కార్యాలయం ఎదుట దారికి అడ్డుగా వేసిన మట్టి

గుంతలు తవ్వారు.. వదిలేశారు

నెల రోజులుగా ముందుకు సాగని రహదారి పనులు
ఇబ్బందులు పడుతున్న స్థానికులు

నాగిరెడ్డిపేట, జనవరి 12: మండల కేంద్రంలో బస్టాండ్ నుంచి తహసీల్ కార్యాలయం వరకు నూతన రహదారి పనుల్లో భాగంగా గుంతలు తవ్వి నెల రోజులుగా పనులు చేపట్టకపోవడంతో.. వ్యాపారులు, స్థానికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. మండల కేంద్రం గోపాల్‌పేటలో మూడు నెలలుగా నూతన రహదారి విస్తరణ పనులు కొనసాగుతున్నాయి. కాగా, యూనియన్ బ్యాంకు, బస్టాండ్ ముందు నుంచి మండల పరిషత్ , తహసీల్ కార్యాలయం వరకు ప్రొక్లెయిన్‌తో డ్రైనేజీ నిర్మాణం కోసం గుంతలు తవ్విన కాంట్రాక్టర్ ఇప్పటి వరకూ పనులు చేపట్టలేదు. దీంతో మట్టిని దాటుకొని వెళ్లాలంటే స్థానికులు ఇబ్బందులు పడుతున్నారు. దుకాణాదారులకు వ్యాపారాలు జరగక ఆర్థికంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. రహదారి కాంట్రాక్టర్ నిర్లక్ష్యంతో నెల రోజులుగా వదిలేసినా ఎవరూ పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు రహదారి పనులపై కనీస సమాచారం కూడా ఇవ్వడం లేదని చెబుతున్నారు. వ్యాపార సముదాయాలు, బస్టాండ్, ఎంపీడీవో, ఎంపీవో, ఐకేపీ, ఈజీఎస్, గ్రామ పంచాయతీ, నీటి పారుదలశాఖ, తహసీల్, శాఖ గ్రంథాలయాలకు వెళ్లే దారులకు అడ్డుగా గుంతలను తవ్వి వదిలేశారు. దీంతో కార్యాలయాలకు సైతం నెల రోజులుగా వాహనాల రాకపోకలు దేవుడెరుగు నడిచి వెళ్లడానికి సైతం కష్టంగా మారిందని వాపోతున్నారు. ఇకనైనా రహదారి అధికారులు ఇబ్బందులు గుర్తించి పనులను వేగవంతంగా పూర్తి చేయాలని కోరుతున్నారు.

బస్టాండ్ సమీపంలో దుకాణాల ఎదుట డ్రైనేజీ నిర్మాణం కోసం తవ్వి వదిలేసిన గుంతలు

నెల రోజులుగా గుంతలు తవ్వి వదిలేశారు..

గోపాల్‌పేటలో దుకాణాల ముందు రహదారి పనుల్లో భాగంగా అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ నిర్మాణం కోసం గుత్తేదారు గుంతలను తవ్వి వదిలివేశారు. నెల రోజులు అవుతున్నా ఇప్పటి వరకూ పనులు ముట్టుకోలేదు. వ్యాపారాలు జరగక ఇబ్బందులు పడుతున్నాం. అధికారులు స్పందించి డ్రైనేజీ పనులు పూర్తి చేసి ఇబ్బందులు తొలగించాలి.

- విఘ్నేశ్వర్‌రెడ్డి, మెడికల్ నిర్వాహకుడు, గోపాల్‌పేట

చాలా ఇబ్బందులు పడుతున్నాం ..

రోడ్డు పనుల కోసం గుంతలను తవ్వి వదిలేసి వెళ్లిపోయారు. నెల రోజులు అవుతున్నా పనులు పూర్తి చేయలేదు. వ్యాపారాలు లేక ఇబ్బందులు పడుతున్నాం. వాహనాలు సైతం లోపలికి రావడం లేదు. అధికారులు స్పందించి త్వరగా పనులు పూర్తి చేసేలా చూడాలి

- హైమద్, కూరగాయాలు, పండ్ల దుకాణ వ్యాపారి, గోపాల్‌పేట

రాష్ట్రస్థాయి హ్యాండ్‌బాల్ జట్టు ఎంపిక

మాక్లూర్, జనవరి 12: మండలంలోని కల్లెడి జడ్పీహెచ్ఎస్‌లో ఉమ్మడి జిల్లా స్థాయి జూనియర్ బాయ్స్ హ్యాండ్‌బాల్ జట్టు ఎంపిక పోటీలు ఆదివారం నిర్వహించారు. నిజామాబాద్, కామారెడ్డి జిల్లాల నుంచి 80 మంది క్రీడాకారులు పాల్గొన్నారని హ్యాండ్‌బాల్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు గంగామోహన్ చక్రు, ప్రధాన కార్యదర్శి పింజ సురేందర్ తెలిపారు. ముఖ్యఅతిథిగా జిల్లా వ్యాయామ ఉపాధ్యాయ సంఘం అధ్యక్షుడు విద్యాసాగర్‌రెడ్డి హాజరై.. ప్రతిభ చూపిన 16 మంది క్రీడాకారులను ఎంపిక చేశారని వెల్లడించారు. ఎంపికైన క్రీడాకారులు ఈనెల 18, 19, 20 తేదీల్లో కరీంనగర్ జిల్లాలో నిర్వహించనున్న పోటీల్లో పాల్గొంటారని తెలిపారు. కార్యక్రమంలో హాకీ సంఘం ప్రధానకార్యదర్శి రమణ, ఎన్ఐఎస్ కోచ్ ఎండీ జావిద్, వ్యాయామ ఉపాధ్యాయులు ప్రవీణ్, సుమన్, కిశోర్ పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి హ్యాండ్‌బాల్ జట్టుకు ఎంపికైన క్రీడాకారులు

ఎమ్మార్పీఎస్ లింగంపేట మండల కార్యవర్గం ఎన్నిక

లింగంపేట, జనవరి12: ఎమ్మార్పీఎస్ మండల నూతన కార్యవర్గాన్ని ఆదివారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు ఎమ్మార్పీఎస్ జిల్లా పర్యవేక్షకుడు మంథిని సామ్యూల్ వెల్లడించారు. మండల శాఖ అధ్యక్షుడిగా నెల్లూరి గంగారం, ఉపాధ్యక్షుడిగా మెట్టు కిషన్, ప్రధాన కార్యదర్శిగా మాసని సాయిలు, సహాయ కార్యదర్శిగా గన్నారం ఆశయ్య, కోశాధికారిగా మన్నె బాలయ్య, అధికార ప్రతినిధిగా గర్నె సంగయ్య, సలహాదారులుగా ద్యామని భూపతి, లెగ్గల రాజు, రాపర్తి సాయిలు, రాజయ్య, భూమని సాయిలును ఎన్నుకున్నారు. నూతనంగా ఎన్నికైన కార్యవర్గ సభ్యులను జిల్లా పర్యవేక్షకుడు సన్మానించారు.

నూతన అధ్యక్షుడిని సన్మానిస్తున్న నాయకులు

విజేతలకు బహుమతుల ప్రదానం

ముగ్గులు పరిశీలిస్తున్న ఎల్లారెడ్డి డీఎస్పీ శ్రీనివాసులు

లింగంపేట(ఎల్లారెడ్డి రూరల్), జనవరి12: సంక్రాంతి పండుగ సందర్భంగా ఎల్లారెడ్డి పట్టణంలోని జీవదాన్ పాఠశాలలో ఏర్పాటు చేసిన ముగ్గుల పోటీల్లో విజేతలకు ఎల్లారెడ్డి డీఎస్పీ శ్రీనివాసులు ఆదివారం బహుమతులు ప్రదానం చేశారు. పండుగ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు కురుమ సాయిబాబా ముగ్గుల పోటీలు నిర్వహించగా, విజేతలకు ఎల్లారెడ్డి డీఎస్పీ, మున్సిపల్ చైర్మన్ పద్మ శ్రీకాంత్ బహుమతులు అందజేశారు. ప్రథమ బహుమతి ఐదు తులాల వెండి, రెండో బహుమతి మూడు తులాల వెండి ప్రదానం చేశారు.

మున్నూరు కాపు సంఘం ఆధ్వర్యంలో సంక్రాంతి సంబురాలు

సంక్రాంతి సంబురాల్లో భాగంగా మున్నూరుకాపు సంఘ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కైట్ ఫెస్టివల్

బిచ్కుంద, జనవరి 12 : బిచ్కుంద మండల కేంద్రంలోని మున్నూరుకాపు సంఘ భవనంలో సదరు సంఘం ఆధ్వర్యంలో ముందస్తు సంక్రాంతి సంబురాలను ఆదివారం నిర్వహించారు. స్వామి వివేకానంద జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం సంబురాల్లో భాగంగా భోగి మంటలు, రంగ వల్లులు వేసి వేడుకలు జరుపుకున్నారు. అనంతరం మున్నూరుకాపు మహిళా ఉపాధ్యాయులను సత్కరించారు. కార్యక్రమంలో సంఘం అధ్యక్షుడు సాయిని అశోక్, సభ్యులు నాల్చర్ రాజు, గడ్డం అరవింద్, దర్పల శేఖర్, నాల్చర్ శ్రీనివాస్, భూమన్న , బాస బాలు, గడ్డం సాయిలు తదితరులు పాల్గొన్నారు.